# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శుక్రవారం-23 - జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 235 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## బీసీలకు పూర్తి న్యాయం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

- బీసీ ముఖ్యమంత్రి అయ్యే సమయం తప్పక వస్తుంది
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం
- దేవుళ్ల పేరుతో రాజకీయాలు సరికాదు: మహేశ్ గౌడ్

హైదరాబాద్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు): కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ నేత ముఖ్యమంత్రి అయ్యే సమయం తప్పకుండా వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బీసీలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని, అవకాశం ఉన్న ప్రతి చోట బీసీలకు పదవులు ఇస్తూ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. కష్టపడి పనిచేస్తే ఎవరి వాటా వాళ్లకు దక్కుతుందని, దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరని మహేశ్ గౌడ్ అన్నారు. రాబోయే రోజులు అన్నీ బీసీలవేనని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పార్టీ కార్యాచరణ సాగుతోందన్నారు.

మిగతా 2లో

# దావోస్ చర్చలకు హైదరాబాద్ ఫాలోఅప్

### ప్రపంచ ఆర్థిక వేదికకు తెలంగాణ ప్రతిపాదన

- జూలై–ఆగస్టులో వార్షిక సమావేశానికి సీఎం సూచన
- తెలంగాణ రైజింగ్ 2047పై సానుకూల స్పందన
- పెట్టుబడులు–ఆవిష్కరణల్లో భాగస్వామ్యానికి ముందడుగు



దావోస్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు): ప్రతి ఏడాది దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు అనంతరం, దానికి అనుసరణగా హైదరాబాద్‌లో జూలై లేదా ఆగస్టు నెలల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో జరిగిన సమావేశంలో, తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఈ ప్రతిపాదనను ప్రపంచ ఆర్థిక వేదిక ముందు ఉంచింది. వేగంగా మారుతున్న గ్లోబల్ వ్యాపార వాతావరణంలో జనవరిలో తీసుకునే నిర్ణయాలకు త్వరితగతిన అమలు దిశగా ఇది దోహదపడుతుందని ముఖ్యమంత్రి వివరించారు.

ఈ సందర్భంగా ప్రపంచ ఆర్థిక వేదిక ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్, డిజిటల్ ఎకానమీ వ్యూహ విభాగాధిపతి మంజు జార్జ్‌తో రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి వ్యూహాలపై చర్చ జరిగింది. తెలంగాణలో పారిశ్రామిక ప్రగతికి ఉన్న అవకాశాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రోత్సాహక విధానాలను ప్రపంచానికి మరింత విస్తృతంగా చూపించాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో స్పష్టం చేశారు.

జూలై-ఆగస్టు నెలల్లో ఫాలోఅప్ సమావేశం నిర్వహించాలన్న ప్రతిపాదనపై ప్రపంచ ఆర్థిక వేదిక ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.

మిగతా 2లో



## గ్రూప్–1 మెయిన్స్ కేసు తీర్పు వాయిదా

- ఫిబ్రవరి 5న తుది తీర్పు ప్రకటించనున్న హైకోర్టు
- సింగిల్ జడ్జి తీర్పుపై దాఖలైన అప్పీళ్లపై నిర్ణయం పెండింగ్
- నియామకాలు తుది తీర్పుకు లోబడి కొనసాగుతాయి

హైదరాబాద్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ గ్రూప్–1 సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై తెలంగాణ హైకోర్టు

2లో

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పత్రాల పంపిణీ

- ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా కార్యక్రమం
- జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్సీ హాజరు
- పేదలకు సొంత ఇల్లు ప్రభుత్వ లక్ష్యం

ఆదిలాబాద్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు): కెరమెరి మండలం మోడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు సంబంధించిన ప్రక్రియ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్వహించారు.

మిగతా 2లో





## రహదారి నిబంధనలు పాటిస్తేనే ప్రాణ రక్షణ

- అరైవ్ అలైవ్ కార్యక్రమంలో ఉచిత హెల్మెట్ల పంపిణీ
- వాహనదారుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం
- సిద్దిపేట పోలీసుల ప్రత్యేక చొరవ

2లో



## ఒకే రోజు రెండు చోట్ల ఆక్రమణల తొలగింపు

- గచ్చిబౌలిలో 2500 గజాల పార్కు పరిరక్షణ
- శామీర్‌పేటలో రోడ్డు ఆక్రమణల తొలగింపు
- ప్రజావాణి ఫిర్యాదులతో క్షేత్రస్థాయి చర్యలు

హైదరాబాద్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు): హైడ్రా ఒకే రోజు రెండు కీలక ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించి ప్రజలకు ఊరటనిచ్చింది. గచ్చిబౌలి ప్రాంతంలో పార్కు స్థలాన్ని కాపాడగా, శామీర్‌పేటలో రోడ్డు ఆక్రమణలను తొలగించి స్థానికులకు దారి చూపింది.

గచ్చిబౌలి టెలికాం నగర్‌లో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు 1982లో అప్పటి హుడా అనుమతులతో 32 ఎకరాల్లో

2లో

## బొగ్గు స్కాంపై సమాధానం చెప్పే దమ్ములేకనే నోటీసుల డ్రామా

- కాంగ్రెస్ వరుస స్కాంల నుంచి దృష్టి మళ్లించేందుకే సిట్ నోటీసులు
- రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే బీఆర్ఎస్ నేతలకు నోటీసులు
- ప్రజా కోర్టులో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలి: హరీష్ రావు

హైదరాబాద్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు): బొగ్గు స్కాంపై సమాధానం చెప్పే ధైర్యం లేకనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోటీసుల డ్రామాకు తెరలేపారని బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్రంగా మండిపడ్డారు. పాలనా వైఫల్యం, కాంగ్రెస్ పార్టీ వరుస స్కాంల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సిట్ నోటీసులను ఆయుధంగా మార్చుకున్నారని విమర్శించారు.



మిగతా 2లో

# హైదరాబాద్ కలెక్టరేట్‌లో అభివృద్ధి పనులపై సమీక్ష

- సంక్షేమ శాఖల అమలుపై ప్రత్యేక దృష్టి
- గురుకులాలు, హాస్టళ్ల పనితీరుపై చర్చ
- లబ్ధిదారులకు పథకాలు చేరుతున్నాయా? సమీక్ష

హైదరాబాద్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై అధ్యక్షత వహించారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు.

మిగతా 2లో




## సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఖాయం

- ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ భారీ విజయం సాధిస్తుంది
- అభివృద్ధి బీఆర్ఎస్‌ది.. మాటలు కాంగ్రెస్‌వి
- వార్డు ఇంచార్జిలతో కేటీఆర్ కీలక దిశానిర్దేశం



సిరిసిల్ల, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు): సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో గులాబీ జెండానే ఎగరడం ఖాయమని కేటీఆర్ స్పష్టం చేశారు. మెజారిటీ వార్డులను గెలుచుకుని సిరిసిల్ల మున్సిపాలిటీని పూర్తిగా కైవసం చేసుకోవడమే లక్ష్యంగా భారత రాష్ట్ర సమితి ముందుకు సాగుతోందని తెలిపారు. సిరిసిల్లలో మున్సిపల్ ఎన్నికలపై వార్డు ఇంచార్జిలతో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ కీలక దిశానిర్దేశం చేశారు.

సిరిసిల్ల ఒకప్పుడు ఎలా ఉందో, బీఆర్ఎస్ పాలనలో ఇప్పుడు ఎలా అభివృద్ధి చెందిందో ప్రజలకు స్పష్టంగా వివరించాలని కేటీఆర్ సూచించారు. మనం చేసిన అభివృద్ధిని మనమే చెప్పుకోవాల్సిన అవసరం ఉందని,

మిగతా 2లో



## దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మంత్రి నారా లోకేష్

దావోస్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు): ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిను ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా జరిగిన ఈ భేటీలో ఇరువురు నేతలు స్నేహపూర్వకంగా పరస్పరం అభివాదాలు చేసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధి, పెట్టుబడులు, ఆవిష్కరణలపై జరుగుతున్న కార్యక్రమాలపై

2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# దావోస్ చర్చలకు హైదరాబాద్ ఫాలోఅప్

(మొదటి పేజీ తరువాయి)

దావోస్‌లో జరిగిన చర్చలు, తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఇటువంటి సమావేశం ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. చైనాలో ప్రతి ఏడాది 'సమ్మర్ దావోస్' నిర్వహిస్తున్న నేపథ్యంలో, హైదరాబాద్‌లోనూ ఇలాంటి ఫాలోఅప్ వేదికకు అవకాశాలు ఉన్నాయని జెరెమీ జర్గెన్స్ తెలిపారు. ఈ అంశంపై సమీప భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. సమావేశంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్, రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్‌ను ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించారు. ఈ విజన్ పరస్పర సహకారానికి అనుకూలంగా ఉందని ప్రపంచ ఆర్థిక వేదిక ప్రతినిధులు ప్రశంసించారు. అలాగే హైదరాబాద్‌లో బయో




ఆసియా-2024 సందర్భంగా ప్రారంభించిన సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్-తెలంగాణ పురోగతిపై చర్చ జరిగింది. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో వేదిక భారత్‌లో ప్రారంభించిన తొలి థీమాటిక్ సెంటర్ ఇదేనని పేర్కొన్నారు. వ్యూహం, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు తెలంగాణను సుస్థిర అభివృద్ధిలో దేశానికి రోల్ మోడల్‌గా నిలబెట్టే దిశగా ముందుకు తీసుకెళ్తాయని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పత్రాల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఎమ్మెల్సీతో పాటు అదనపు కలెక్టర్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఆలస్యం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నివాస సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, సామాజిక భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని పెంచేలా ఈ



పథకం రూపకల్పన జరిగిందని పేర్కొన్నారు. పథకం అమలులో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని, అందుకోసం ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# హైదరాబాద్ కలెక్టరేట్‌లో అభివృద్ధి పనులపై సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా రహదారులు, మౌలిక వసతులు, ప్రజా సేవలకు సంబంధించిన పనులు నిర్దిష్ట గడువులో పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ లేకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా అమలు చేయాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల పని తీరుపై ప్రత్యేకంగా చర్చించారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యా ప్రమాణాల మెరుగుదల అంశాలపై అధికారులు నివేదికలు సమర్పించారు. అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థా



యిలో చేరుతున్నాయా అనే అంశాన్ని కూడా సమీక్షించారు. విద్య, వైద్యం రంగాల్లో చేపట్టిన కార్యక్రమాల అమలును వేగవంతం చేయాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డితో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ఒకే రోజు రెండు చోట్ల ఆక్రమణల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

లేఅవుట్ వేశారు. ఇందులో నాలుగు వేల గజాలను పార్కు కోసం కేటాయించారు. కాలక్రమంలో దాదాపు 1500 గజాల వరకు ఆక్రమణలు జరిగి నివాసాలు వచ్చాయి. మిగిలిన 2500 గజాల పార్కు స్థలంలోనూ ప్లాట్లు ఉన్నాయంటూ కొందరు ఆక్రమణలకు పాల్పడ్డారు. దీంతో టెలికాం నగర్ నివాసితులు ప్రజావాణి ద్వారా హైడ్రాను ఆశ్రయించారు.

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. నాలుగు వేల గజాలు పార్కుకు కేటాయించబడినట్టు నిర్ధారణైంది. ఇప్పటికే నివాసాలు ఉన్న భాగాన్ని మినహాయించి మిగిలిన 2500 గజాల స్థలంలో ఆక్రమణలను తొలగించి, పార్కు స్థలంగా బోర్డులు ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో ఆక్రమణలకు ఆస్కారం లేకుండా ఫెన్సింగ్ కూడా వేశారు.



**శామీర్‌పేటలో రోడ్డు ఆక్రమణల తొలగింపు**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని శామీర్‌పేట ఫ్రెండ్స్ కాలనీలో రోడ్డు ఆక్రమణలను హైడ్రా గురువారం తొలగించింది. సర్వే నంబర్ 1198లో 1987లో వేసిన లేఅవుట్‌లో 20 అడుగుల రహదారిని ఆక్రమించి గోడలు నిర్మించి, గేటు ఏర్పాటు చేసి పక్క ప్లాట్లలో కలిపారు. శామీర్‌పేట పోలీస్ స్టేషన్ మీదుగా వెళ్లే దారి మూసుకుపోయిందంటూ ప్రజావాణికి ఫిర్యాదు అందడంతో, క్షేత్రస్థాయిలో విచారణ చేసి రోడ్డు ఆక్రమణను నిర్ధారించారు. ఆపై రోడ్డు ఆక్రమణలను తొలగించి కాలనీ వాసులకు దారి చూపారు. పదిహేను ఏళ్లుగా ఫిర్యాదులు చేసినా పరిష్కారం కాలేదని, హైడ్రా చొరవతో ఇప్పుడైనా దారి దొరికిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.




# బీసీలకు పూర్తి న్యాయం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలకు ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేయడం దేశానికి మంచిది కాదని, కులం-మతం పేరుతో మన పిల్లలకు భవిష్యత్తు రాదని వ్యాఖ్యానించారు. రాముడు, అంజనేయుడి పేర్లు చెప్పి ఓట్లు దండుకోవడం సరికాదని విమర్శించారు.

అర్వింద్ 'జై శ్రీరాం' అని మాత్రమే కాకుండా, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి తాను చేసిన అభివృద్ధి ఏంటో వివరించి ఓట్లు అడగాలని హితవు పలికారు. రాముని పేరు చెప్పడం తప్ప నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. దేవుళ్లను రాజకీయాలతో ముడిపెట్టవద్దని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.



# రహదారి నిబంధనలు పాటిస్తేనే ప్రాణ రక్షణ

సిద్దిపేట, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):

రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే ప్రాణాలను కాపాడుకోవచ్చని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌కు దోహదపడతాయని పేర్కొన్నారు.

అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా తొగుట మండలం పెద్దమాసన్‌పల్లి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సౌజన్యంతో గ్రామంలోని వంద మంది వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది చట్టపరమైన బాధ్యతతో



పాటు ప్రాణ రక్షణకు కీలకమని కమిషనర్ తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు గ్రామస్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని పోలీస్ అధికారులు వెల్లడించారు. వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై కూడా వాహనదారులకు సూచనలు చేశారు.

ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను తగ్గించగలమని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సిద్దిపేట పోలీసులు పిలుపునిచ్చారు.

# బొగ్గు స్కాంపై సమాధానం చెప్పే దమ్ములేకనే నోటీసుల డ్రామా

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ బామ్మర్ది బొగ్గు స్కాం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో అటెన్షన్ డైవర్షన్ రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతోందని హరీష్ రావు ఆరోపించారు. ఈ రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగానే నిన్న తనకు, నేడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్కు నోటీసులు ఇచ్చారని స్పష్టం చేశారు.

రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకోవాలని హెచ్చరిస్తూ, ప్రతీకారం అనేది బలహీనుల ఆయుధమని, దమ్మున్న నాయకుడి ఆయుధం ఎప్పుడూ ప్రజాపోరాటమేనని హరీష్ రావు వ్యాఖ్యానించారు. పోలీసులను ఆయుధాలుగా వాడుకోవడం బలహీనతకు నిదర్శనమని, బీఆర్ఎస్ మాత్రం ప్రజల మధ్య నిటారుగా నిలబడి ప్రశ్నిస్తోందన్నారు.

నోటీసులకు సమాధానం చెప్పేందుకు బీఆర్ఎస్ నాయకులు ఎప్పుడూ సిద్ధమేనని, అయితే రేపు ప్రజా కోర్టులో సమాధానం చెప్పేందుకు రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎంత మంది బీఆర్ఎస్ నాయకులను విచారణ పేరుతో వేధించినా, ఆరు గ్యారెంటీలు, నాలుగు వందల ఇరవై హామీలు అమలు చేసే వరకు కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ కుంభకోణాలు, వాటాల పంచాయతీలను



బట్టబయలు చేస్తూనే ఉంటామని హరీష్ రావు తెలిపారు. ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ నాయకులు సింహాల్లా గర్జిస్తూనే ఉంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

వేరే వారు చెప్పరని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత స్థానిక ఎన్నికలు ఉండవని, నేరుగా సాధారణ ఎన్నికలే ఉంటాయని పేర్కొంటూ, ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన పేరుతో ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎత్తివేయాలనే కుట్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఈ అంశం సిరిసిల్ల ప్రజలు, న్యాయవాదులు, మేధావుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. తుగ్లక్ తరహా నిర్ణయాలతో కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని విమర్శించారు.

సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ షాక్‌లో ఉందని, అందుకే మున్సిపల్ ఎన్నికలకు భయపడుతోందని కేటీఆర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 40 శాతం పైగా సర్పంచ్ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గెలిచిన స్థానాలు వేళ్ల మీద లెక్కపెట్టే స్థాయిలో కూడా లేవని వ్యాఖ్యానించారు.

సిరిసిల్ల పట్టణం గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌కు దూరంగా ఉందని, బీఆర్ఎస్ ఆవిర్భావం



తర్వాత మున్సిపాలిటీపై పూర్తి ఆధిపత్యం సాధించామని కేటీఆర్ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సింగిల్ డిజిట్ కూడా దాటలేని పరిస్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ బాకీ కార్డును ప్రతి గడపకు చేరవేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతులు, మహిళలు, వృద్ధులు, నేతన్నలు, రిటైర్డ్ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత బాకీ పెట్టిందో ప్రజలకు వివరించాలని సూచించారు. సంక్రాంతి దాటినా రైతు బంధు రాలేదని, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వలేదని, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు కూడా దిక్కు లేని పరిస్థితి ఉందని విమర్శించారు. నేతన్నలకు నిజమైన అండగా నిలిచింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.

సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలను తానే నేరుగా పర్యవేక్షిస్తానని ప్రకటించిన కేటీఆర్, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ ఫీవర్ పట్టుకుందని, సిరిసిల్ల ప్రజలంతా గులాబీ జెండా వైపే ఉన్నారని స్పష్టం చేశారు.

మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, ప్రతి వార్డు ఇంచార్జి ఇంటింటి ప్రచారం చేయాలని, అభివృద్ధిని వివరించి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మంత్రి నారా లోకేష్

(మొదటి పేజీ తరువాయి)

సంక్షిప్తంగా చర్చించినట్లు సమాచారం. ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పాల్గొన్న నాయకుల మధ్య ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. అంతర్జాతీయ స్థాయిలో భారత రాష్ట్రాల ప్రగతిని ప్రతిబింబించే అంశాలపై ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిసింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన సందర్భంగా జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ, రెండు రాష్ట్రాల మధ్య పరస్పర గౌరవం, సమన్వయాన్ని ప్రతిబింబించిందని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.



# సీతారామచంద్రస్వామికి పట్టు వస్త్రాల సమర్పణ





**ఖమ్మం బ్యూరో, జనవరి 22(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగిలిగోండ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ సీతారామచంద్రస్వామి 9వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి నాకిలిగోండ గ్రామ సర్పంచ్ వేపూరి పద్మా రవీంద్రబాబు ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. ఆలయ అర్చకులు సర్పంచ్ దంపతులకు తీర్థప్రసాదాలు అందించారు. తదనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వైస్ చైర్మన్ కమిటీ మెంబర్లు, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు





- ప్రతి పౌరుడి వ్యక్తిగత బాధ్యతగా భావించాలి.
- ఎమ్మెల్యే జారె.ఆదినారాయణ.

**అశ్వారావుపేట, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం-2026 కార్యక్రమాల నేపథ్యంలో ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో డీజీపీ సతీష్ కుమార్, సీఐ నాగరాజు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నిర్మల, దమ్మపేట, అశ్వారావుపేట ఎస్సైలు సాయి కిషోర్ రెడ్డి, యయాతి రాజు, అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు విజయ్ పాల్గొని తమ పరిధిలోని అంశాలపై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.

అనంతరం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి వ్యక్తిగత బాధ్యత అని తెలిపారు. 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి నిర్లక్ష్యం యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని హెచ్చరించారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక వేగంతో ప్రయాణించడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొంటూ, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతకంగా మారవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, యువత రోడ్డు నిబంధనలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం కుటుంబాలకు తీరని దుఃఖాన్ని మిగులుస్తుందని, ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తరపున గ్రామీణ ప్రాంత ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి తమ ప్రాణ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవాలని కోరారు.

# పెనుబల్లిలో సంక్షేమ చెక్కుల పంపిణీ





**సత్తుపల్లి, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** పెనుబల్లి మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా మండలంలో మొత్తం 38 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు రూ. 11 లక్షల 51 వేల 500 విలువతో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మొత్తం 101 చెక్కులు అందజేశారు. ఈ చెక్కుల ద్వారా ఎస్సీ: 25 మంది, బీసీ: 62 మంది, బీసీఈ: 1 మంది, ఈబీసీ: 13 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందగా, మొత్తం చెక్కుల విలువ కోటి రూపాయలకు పైగా ఉన్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

# ఎస్‌బీటీఈటీ డిప్లొమా ఫలితాల్లో సాయిస్ఫూర్తి అటానమస్ కళాశాలకు జిల్లా స్థాయి అగ్రస్థానం



**సత్తుపల్లి, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఎస్‌బీటీఈటీ హైదరాబాద్ నిర్వహించిన డిప్లొమా మొదటి, రెండవ, మూడవ సంవత్సరం సెమిస్టర్/ఫైనల్ పరీక్షల ఫలితాల్లో బి.గంగారం గ్రామంలో సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల డిప్లొమా విభాగం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాల మరోసారి ప్రథమ స్థానంలో నిలిచిందని కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు.

మొదటి సంవత్సరం ఫలితాలు

డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో శీలం భరత్ రెడ్డి (9.63 ఎస్‌జీపీఏ), సయ్యద్ నజీర్ పాషా (9 ఎస్‌జీపీఏ), గోదా యస్వంత్ (8.69 ఎస్‌జీపీఏ) ఉత్తమ ఫలితాలు సాధించారు.

డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో మిద్దె కృష్ణప్రియ (9.38), బూరుగు రాజేష్ (9.06), షేక్ వసీం (8.75) మెరిశారు.

డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో పెంటికల నావధీర్ 9.19 ఎస్‌జీపీఏతో ప్రతిభ చూపారు.

రెండవ సంవత్సరం ఫలితాలు

డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పాలోజు గీతశ్రీ 9.83 ఎస్‌జీపీఏతో అగ్రస్థానంలో నిలవగా, మిద్దె భవిత (9.5), కంచర్ల కోమలి (8.98), బైరెడ్డి శివాని (8.98) ఉత్తమ ఫలితాలు సాధించారు.

డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో విశ్వనాధుని యస్వంత్ (9.29), కకనబోయిన హేమంత్ సాయి (8.63), రావూరి ఆదిత్య (8.52) మెరిశారు.

డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో తాటి అభిషేక్ రాజా వర్ధన్ రావు 9.5 ఎస్‌జీపీఏ సాధించగా, కీర్తి కిషోర్ సాయి చరణ్ 7.65 ఎస్‌జీపీఏ సాధించారు.

మూడవ సంవత్సరం ఫలితాలు

డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో గజేంద్రుల సంకీర్తన (8.98), వాకాడని భవ్యశ్రీ (8.74), వినుకొండ హేమ ఉదయ్ కుమార్ రాజు (8.61) ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మొత్తం మీద పలువురు విద్యార్థులు 9కు పైగా ఎస్‌జీపీఏ సాధించగా, కళాశాల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.

అభినందనలు తెలిపిన యాజమాన్యం

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యావేత్త, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత, రాజ్యసభ సభ్యుడు మరియు సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్ రియాలిటీ సిస్టమ్ ద్వారా విద్యార్థులను అభినందించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి, డిప్లొమా డీన్ తోమంద్రు రాంబాబు, అన్ని విభాగాల హెచ్ఓడీలు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# ఏదులాపురం లక్ష్యం.. 'నంబర్ వన్' సంకల్పం!



- కాంగ్రెస్‌ను గెలిపించండి.. ఏదులాపురం ప్రగతికి మంత్రి పొంగులేటి గ్యారెంటీ!
- అభివృద్ధిలో 'పాలేరు' రాష్ట్రానికే దిక్సూచి కావాలి!
- నారీ శక్తికి నీరాజనం.. పాలనలోనూ మహిళలకే అగ్రతాంబూలం!
- రూ. 62.77 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో తుంబూరు దయాకర్ రెడ్డి

**ఖమ్మం బ్యూరో, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** పాలేరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అడుగులు వేస్తున్నారని, రాబోయే రోజుల్లో ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే 'నంబర్ వన్' గా తీర్చిదిద్దేందుకు మంత్రి పొంగులేటి కృషి చేస్తున్నారని ఆయన క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో మంత్రి క్యాంపు కార్యాలయంలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

178 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ఖమ్మం రూరల్ మండలంలోని 105 మంది లబ్ధిదారులకు రూ. 32,63,000 విలువైన చెక్కులను, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 73 మంది లబ్ధిదారులకు రూ. 30,14,000 విలువైన చెక్కులను అందజేశారు.

అభివృద్ధి బాధ్యత మంత్రి పొంగులేటిది!

ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఏదులాపురంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తే, ఆ ప్రాంతాన్ని రాష్ట్రం యావత్తు గర్వించేలా అభివృద్ధి చేసే బాధ్యతను మంత్రి పొంగులేటి స్వయంగా తీసుకుంటారని భరోసా ఇచ్చారు.

మహిళా సాధికారతకు కాంగ్రెస్ కృషి

మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నిర్వచనం చెబుతోందని దయాకర్ రెడ్డి కొనియాడారు. బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆగకుండా, 'స్త్రీ శక్తి' పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల నిర్వహణ బాధ్యతలను సైతం మహిళలకే అప్పగించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. కేవలం ఓటర్లుగానే కాకుండా, మహిళలను పాలకులుగా చేయాలన్న సంకల్పంతోనే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో చైర్మన్ సీట్లలో మెజారిటీ స్థానాలను వారికే రిజర్వ్ చేసినట్లు గుర్తుచేశారు. ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం లాంటిదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటమితో వెనకడుగు కాదు.. గ్రామ అభివృద్ధికి అంకితంగా ముందుకు వెళ్తా

- వెల్టూర్ కాంగ్రెస్ కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి వడ్డె శేఖర్



**పెద్దమందడి,జనవరి22(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన వడ్డె శేఖర్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి ఎదురైనా, గ్రామ ప్రజల సమస్యలపై తన పోరాటం ఏమాత్రం తగ్గదని తెలిపారు.గ్రామ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని అన్నారు.ఇటీవల వెల్టూర్ సమీపంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఎమ్మెల్యే మేఘా రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారని తెలిపారు. ప్రజల సమస్యలపై స్పందించి తక్షణమే చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డికి వడ్డె శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి వడ్డె శేఖర్ మాట్లాడుతూ.. వెల్టూర్ గ్రామానికి రైతులు, కూలీలు, వ్యాపారులు ఉపయోగపడేలా కూరగాయల వారంతపు సంత ఏర్పాటు చేయడం అత్యవసరమని అన్నారు.అలాగే గ్రామ ప్రజలకు ఆర్థిక లావాదేవీలకు సౌలభ్యం కల్పించే విధంగా బ్యాంకు లేదా బ్యాంకు శాఖ ఏర్పాటు అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సాధించే దిశగా కృషి చేస్తానని తెలిపారు.వెల్టూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయడం ద్వారా పరిసర గ్రామాలకు పరిపాలనా సౌలభ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.అదే విధంగా గ్రామంలో అన్ని కులాలకు న్యాయం జరిగేలా కులాల వారీగా కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఎమ్మెల్యే సహకారంతో వాటిని అమలు అయ్యేలా ప్రయత్నిస్తానని అన్నారు.సర్పంచ్ పదవి రాకపోయినా గ్రామానికి సేవ చేయాలన్న సంకల్పం తగ్గలేదని పేర్కొన్న వడ్డె శేఖర్, ప్రజల అవసరాలను అర్థం చేసుకుని గ్రామ అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఎమ్మెల్యే మేఘా రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, వెల్టూర్ గ్రామ భవిష్యత్తు కోసం ప్రజలతో కలిసి అడుగులు వేస్తానని దృఢంగా తెలిపారు.

# నాగారం నేషనల్ మార్ట్‌లో 'అరైవ్ అలైవ్-2026'పై విస్తృత అవగాహన

**కీసర, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్-2026" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో, డీజీపీ బి. శివధర్ రెడ్డి మార్గదర్శకత్వంలో కీసర పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా డే-7 అవగాహన కార్యక్రమాన్ని నాగారం నేషనల్ మార్ట్ వద్ద కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివ శంకర్, కీసర పోలీస్ ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.షాపింగ్‌కు వచ్చిన ప్రజలు, వ్యాపారస్తులు, వాహనదారులు, కుటుంబ సభ్యులు, దుకాణదారులు, వెండర్లు మరియు సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా పోలీసులు హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, పాదచారుల సురక్షిత ప్రవర్తన, జీబ్రా క్రాసింగ్ వినియోగం, మొబైల్ ఫోన్ వాడకం వల్ల కలిగే ప్రమాదాలు, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, తప్పు మార్గాల్లో డ్రైవింగ్ వల్ల కలిగే నష్టాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. అలాగే 112 - ఉచిత 24x7 అత్యవసర సేవల నంబర్, ప్రమాదం జరిగిన వెంటనే కీలకమైన "గోల్డెన్ అవర్" ప్రాముఖ్యత, గుడ్ సమారిటన్ చట్టం, హిట్ అండ్ రన్ కేసుల్లో అమలులో ఉన్న మోటార్ వాహన ప్రమాద పరిహార పథకం / బాధిత పరిహార పథకం వివరాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రజలు అడిగిన సందేహాలకు పోలీసులు ట్రాఫిక్ నిబంధనలు, జరిమానాలు, సురక్షిత డ్రైవింగ్ విధానాలు, అత్యవసర సహాయం పొందే విధానం, ప్రమాద నివేదిక నమోదు ప్రక్రియపై స్పష్టత ఇచ్చారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ, "అరైవ్ అలైవ్-2026 - ప్రతి ప్రయాణంలో, ప్రతిసారీ" అనే లక్ష్యాన్ని సాధించాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఒకరి రక్తదానం... ముగ్గురికి ప్రాణదానం





**సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం**

**సత్తుపల్లి, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ సహకారంతో సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడుతూ, ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానం చేసినట్లేనని అన్నారు. రక్తదానానికి మించిన దానం మరొకటి లేదని, రక్తదానం చేసిన వ్యక్తి మరొకరికి ప్రాణం పోసినట్లేనని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ సత్తుపల్లి శాఖ అందించిన సహకారం మరువలేనిదని ఆయన కొనియాడారు.
ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సత్తుపల్లి అధ్యక్షులు గోగడ రవికుమార్ మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ముఖ్యంగా రక్తదాన శిబిరాల నిర్వహణలో భాగస్వాములవడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డిపో అసిస్టెంట్ మేనేజర్ పి. ప్రవీణ్‌కుమార్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్. సాహితి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రవికుమార్, పి. రమేష్, వి. జగన్మోహన్‌రావు, జె. సత్యనారాయణ, విశ్వశాంతి స్కూల్ కరస్పాండెంట్ పసుపులేటి నాగేశ్వరరావు, ఆర్టీసీ విబిఓ కిన్నెర ఆనందరావు, డీఐ ప్రభాకర్, సేఫ్టీ వార్డెన్ రఘురాం, కాంతారావు, ఏడీసీలు వెంకటయ్య, బాలస్వామి, ఇబ్రాయిల్, జాకబ్, ఆనందం, వెల్ఫేర్ కమిటీ మెంబర్ సైదిరెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# “అరైవ్ అలైవ్ – 2026”లో భాగంగా రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం





**కుషాయిగూడ, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన “అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ - 2026” కార్యక్రమంలో భాగంగా గురువారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో తల్లూరి థియేటర్ జంక్షన్ మరియు ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్ ప్రాంతాల్లో రహదారి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏసీపీ వై. వెంకట్ రెడ్డి నాయకత్వంలో జరిగింది. ఇందులో కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓ ఎల్. భాస్కర్ రెడ్డి, కుషాయిగూడ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ రామ లక్ష్మణ రాజు పాల్గొని, రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా, కుషాయిగూడ పోలీసులు విద్యార్థులతో కలిసి తల్లూరి థియేటర్ జంక్షన్ నుండి ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్ వరకు రహదారి భద్రతా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్ వద్ద మానవ గొలుసు ఏర్పాటు చేసి, ప్రజలను చురుకుగా ఈ ప్రచారంలో భాగస్వాములను చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఏసీపీ వై. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి అని సూచించారు. ముఖ్యంగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని స్పష్టంగా తెలిపారు. విద్యార్థులు ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్ వద్ద ఫ్లాష్ మాబ్ ప్రదర్శన నిర్వహించి, రహదారి భద్రతా నియమాలను ఆకర్షణీయమైన రీతిలో ప్రజలకు చేరువ చేశారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఎస్‌ఐలు ఎన్. సుధాకర్ రెడ్డి, బి. శ్రీనివాస్, ఎం. విజయ్, కె. సతీష్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వెల్టూర్ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగే సౌకర్యం





**ఎమ్మెల్యే మేఘా రెడ్డికి గ్రామ ప్రజల తరఫున వడ్డే శేఖర్ కృతజ్ఞతలు**

**పెద్దమందడి, జనవరి22 (తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ సమీపంలో ఎక్స్‌ప్రెస్ రిక్వెస్ట్ బస్సులు ఆగే సౌకర్యం కల్పించాలని గ్రామ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెంట్ సర్పంచ్ అభ్యర్థి వడ్డే శేఖర్ ఎమ్మెల్యే మేఘా రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపై స్పందించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి సంబంధిత ఆర్టీసీ డిపో మేనేజర్ దృష్టికి విషయం తీసుకెళ్లారు. దీని ఫలితంగా బస్టాప్ మంజూరు కాకపోయినా, ప్రయాణికుల సౌకర్యార్థం నేటి నుండి ఎక్స్‌ప్రెస్ బస్సులు వెల్టూర్ వద్ద ఆగనున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల వెల్టూర్ గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ప్రయాణంలో ఎంతో సౌలభ్యం కలుగనుందని వడ్డె శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వడ్డే శేఖర్ మాట్లాడుతూ ..ఈ చర్య ప్రయాణికులకు సౌకర్యార్థంగా ఉండటంతో పాటు గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. సమస్యను సానుకూలంగా పరిగణించి పరిష్కరించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డికి గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే భవిష్యత్తులో కూడా గ్రామ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామం మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్, నాగమణి నరేష్, వార్డు సభ్యులు నాగభూషణ్, నాగరాజు గౌడ్, వివేక్, బిజెపి మాజీ మండల అధ్యక్షుడు రమేష్ ,గుండెల ఆంజనేయులు, మిల్లర్ రాజు, పాముల రాములు, కొండన్న, కావలి వెంకటయ్య, దయ్యాల రమేష్, మల్లయ్య, శ్యాంసుందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సురక్షిత ప్రయాణానికే పోలీస్ శాఖ 'అరైవ్- అలైవ్' కార్యక్రమం

**ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి**

**ఖమ్మం బ్యూరో, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** సురక్షిత ప్రయాణానికే పోలీస్ శాఖ 'అరైవ్ అలైవ్' కార్యక్రమం చేపట్టిందని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు.
అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా నగరలోని ఎస్ ఆర్ కాలేజ్ విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమని బంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్, అలైవ్ కార్యక్రమం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు, విద్యా ర్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకమన్నారు. ట్రాపిక్ నియమాలు పాటించడం చట్టపరమైన బాధ్యతే కాదని మన కుటుంబాల భద్రతకు సంబంధించిన అంశమన్నారు. రోడ్డు భద్రతను జీవనశైలిలో భాగం చేసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడుపకుండా ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటిస్తూ తమ కుటుంబాలను, సమాజాన్ని సురక్షితంగా ఉంచాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు.





## బాధిత కుటుంబానికి రూ.1.50 లక్షల ఎల్ఓసి అందజేసిన ఎంపి కావ్య



**వేలేరు, జనవరి22 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రానికి చెందిన లక్కీరెడ్డి మల్లారెడ్డికి మోకాలి శస్త్రచికిత్స నిమిత్తం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య రూ.1.50 లక్షల విలువైన
ఎల్ఓసి అందజేశారు. ఈ విషయాన్ని వేలేరు మండల మాజీ సర్పంచ్ విజయపురి మల్లికార్జున్ ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి (ఎల్ఓసి) ఆర్థిక సహాయం అందించారు. హనుమకొండలోని ఎంపీ నివాసంలో కొత్తకొండ దేవస్థానం డైరెక్టర్ కుంద్రు దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బాధితులకు ఎల్ఓసి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎంపీ కడియం కావ్య భరోసా ఇచ్చారు. వైద్య చికిత్సకు అవసరమైన మరింత సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కంకణాల వేణుగోపాల్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బైరీ నవీన్ గౌడ్ జన్మదిన వేడుకలులో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**కాప్రా , జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్ జన్మదిన వేడుకలు మల్లారెడ్డి గార్డెన్, ఎల్లారెడ్డిగూడలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బైరీ నవీన్ గౌడ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజల మన్ననలు పొందే నాయకుడిగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలను ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించారు.

## అమ్ముగూడ శ్మశానవాటిక అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



**యాప్రాల్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి నియోజకవర్గం నేరేడ్మెట్ సర్కిల్ యాప్రాల్ పరిధిలోని అమ్ముగూడ శ్మశానవాటికలో సుమారు రూ.1.90 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మరియు నేరేడ్‌మెట్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి వారి సహకారం, మార్గదర్శకత్వంతో విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, శ్మశానవాటిక అభివృద్ధి ద్వారా సమాజానికి మెరుగైన మౌలిక వసతులు, గౌరవప్రదమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని శ్మశానవాటికను సర్వసౌకర్యాలతో అభివృద్ధి చేయడం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి డివిజన్ అధ్యక్షుడు ఆదిత్య, శ్మశానవాటిక అధ్యక్షుడు పరమేష్, పరస్ జైన్, పర్వతాలు, విష్ణు, రమణ్, శ్మశానవాటిక కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

TELANGANA MUCHATLU
తెలంగాణ ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## సమ్మక్క సారలమ్మ మినీ మేడారం జాతర ఏర్పాట్లను పరిశీలించిన వేలేరు ఎస్సై సురేష్



**వేలేరు,జనవరి22(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ మినీ మేడారం జాతర ఏర్పాట్లను వేలేరు ఎస్సై సురేష్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా వానదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం జాతర ప్రాంగణాన్ని పరిశీలించిన ఎస్సై, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జాతర కమిటీ నిర్వాహకులకు సూచించారు. భద్రతా ఏర్పాట్లతో పాటు రద్దీ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, రాకపోకల సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జాతర సందర్భంగా శాంతిభద్రతలు పరిరక్షించేలా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉంటుందని ఎస్సై తెలిపారు. నిర్వాహకులు, గ్రామ పెద్దలు, పోలీసు శాఖ సమన్వయంతో జాతరను సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ గోల్లేనా రమేష్, ఉపాధ్యక్షుడు సట్ల రవీందర్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## శాలపల్లి రైతులకు 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు



**ఎమ్మెల్యే కడియం సహకారంతో రైతుల ఇబ్బందులకు పరిష్కారం**

**వేలేరు,జనవరి22(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలంలోని శాలపల్లి గ్రామంలో ఉన్న విద్యుత్ రూపాంతరకంపై అధిక భారం పడటంతో సాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను రైతులు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించి అరవై మూడు కిలోవోల్ట్ సామర్థ్యంతో కూడిన నూతన విద్యుత్ రూపాంతరకాన్ని మంజూరు చేయించారు.

ఆదరి చిన వెంకన్న బావి వద్ద నూతన రూపాంతరకాన్ని ఏర్పాటు చేసి, గ్రామ సర్పంచ్ కూరపాటి అశోక్, ఉపసర్పంచ్ ఎర్రగోల్ల రమేష్, స్థానిక రైతులు, వార్డు సభ్యులు కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ప్రభుత్వం తరపున ముందుండి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. రైతుల సమస్యను సత్వరమే గుర్తించి విద్యుత్ రూపాంతరకం ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యేకు, నాయకులకు, అలాగే పనులను సమర్థంగా పూర్తి చేసిన విద్యుత్ శాఖ అధికారులు మరియు లైన్‌మన్ బొల్లికొండ వెంకటేశ్వర్లుకు గ్రామ రైతులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు భద్రతే లక్ష్యంగా "అరైవ్ అలైన్" కార్యక్రమం




- ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

**ఖమ్మం బ్యూరో, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకున్నప్పుడే రోడ్డు ప్రమాదాలు నియంత్రణలో ఉంటాయని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా జరుగుతున్న ప్రాణనష్టాన్ని తగ్గించి, ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యానికి చేరాలనే ఉద్దేశంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'అరైవ్ అలైవ్' అనే ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీ చైతన్య కాలేజ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై పోలీస్ శాఖ దృష్టి ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే, ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్, సీటుబెల్ట్ వాడకంలో అలసత్వం వంటి కారణాలే ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు శిక్షలతో పాటు అవగాహన అత్యంత అవసరమని భావించి 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, జాతీయ రహదారులు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, ఫంక్షన్ హాళ్లు వంటి చోట్ల ప్రజలను నేరుగా కలుసుకుని అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు, యువతే మార్పుకు నాంది రోడ్డు భద్రతపై యువతలో చైతన్యం వస్తే సమాజం మొత్తం మారుతుందన్న నమ్మకంతో విద్యార్థులు, యువకులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

# ఉద్యమకారుల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది





- మాజీ ఎంపీ నామ
- వైరా, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలు కుటుంబాలకు మాజీ ఎంపీ నామ పరామర్శ

**ఖమ్మం బ్యూరో ,జనవరి22 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం నాడు వైరా, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించిన ఆయన పలు కుటుంబాలను పరామర్శించారు. అందులో భాగంగా ముందుగా కారేపల్లి మండల వాస్తవ్యులు, మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, జడల వెంకటేశ్వర్లు మృతి చెందిన విషయం తెలిసిందే, ఈ సందర్భంగా వారి నివాసానికి వెళ్లి వారి సతీమణి మాజీ ఎంపీటీసీ జడల వసంత, కుమారుడు జడల కళ్యాణ్ తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు, అధైర్యపడొద్దు అండగా ఉంటామన్నారు. ఆయనతో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ వారు మన మధ్య లేకపోవటం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని మాజీ ఎంపీ నామ పేర్కొన్నారు. అనంతరం కారేపల్లి మండలం గాదపాడు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దాచెపల్లి కృష్ణారెడ్డి బుధవారం నాడు మరణించిన విషయం తెలుసుకుని ఆ గ్రామానికి వెళ్లి వారి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు అలానే రఘునాథపాలెం మండలం, చింతగుర్తి గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్, దిశా కమిటి మాజీ సభ్యులు మెంటెం రామారావు మాతృమూర్తి శకుంతల దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై నివాళ్లు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు అనంతరం అక్కడ నుండి ఖమ్మం చేరుకొని వీడియోస్ కాలనీ నందు ఇటీవల మరణించిన మోతుకూరి పుల్లయ్య నివాసానికి వెళ్లి వారి కుమారుడు గోపాలరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీ నామ వెంట రఘునాథపాలెం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వీరు నాయక్, కార్పొరేటర్ జ్యోతిరెడ్డి, నాయకులు తాతా వెంకటేశ్వర్లు, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, పిన్ని కోటేశ్వరరావు, కనకమేడల సత్యనారాయణ, మోరంపూడి ప్రసాద్ రావు, గొడ్డేటి మాధవరావు, ముత్యాల సత్యనారాయణ, వున్నం వీరేందర్, రమేష్, రావూరి శ్రీను, బత్తుల శ్రీను, డి రవీందర్, మోతుకూరి పాపారావు, సిరిపురపు సంపత్, కనకమేడల గోపాల కృష్ణమూర్తి, వెంగళం శ్రీను, వాకదాని కోటేశ్వరరావు, అన్వేష్, కనగళ్ళ శ్రీకాంత్, రామకృష్ణ, సునావత్ రవి, లక్ పతి, రేగళ్ల కృష్ణప్రసాద్ లతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

# ప్రజా పాలనలో మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట





- మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేసిన పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన సాగుతోందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రజా పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష ప్రాధాన్యం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద ఉప్పల్ నియోజకవర్గంలోని మైనారిటీ మహిళలకు 175 కుట్టు మిషన్లు మంజూరు అయ్యాయని తెలిపారు.ఉప్పల్ డివిజన్ వార్డ్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, కాప్రా కార్పొరేటర్ స్వర్ణ రాజ్ శివమణి హాజరై లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు ఈ కుట్టు మిషన్లు అందజేస్తున్నామని చెప్పారు. ఈ పథకం ద్వారా వృత్తిపరమైన నైపుణ్యాలు పెరిగి, స్వయం ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని, ముఖ్యంగా నిరుద్యోగ మహిళలు అధికంగా లబ్ధి పొందుతారని తెలిపారు. పేద వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మల్లాపూర్ పారిశ్రామిక ప్రాంత ప్రజల భద్రతకు కీలక అడుగు నెమలి అనిల్ కుమార్





**మల్లాపూర్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ పారిశ్రామిక ప్రాంతంలో మాణిక్చంద్ రోడ్ నుంచి నాచారం రోడ్ వరకు సరైన వీధి దీపాలు లేకపోవడం వల్ల కార్మికులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు నెమలి అనిల్ కుమార్ తెలిపారు.ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఐఎఎల్ఏ కమిషనర్ ఏ. ప్రభాకర్‌ను, ఐఎఎల్ఏ మేనేజర్ విజయ్ కుమార్‌ను కలిసి కొత్త వీధి దీపాల ఏర్పాటు కోసం అధికారిక రిప్రెజెంటేషన్ అందజేశారు.ఈ సందర్భంగా మాణిక్చంద్ రోడ్ - శాహీ ఎక్స్‌పోర్ట్స్ - రహేజా విస్టాస్ - నాచారం ఎక్స్ రోడ్స్ వరకు సరైన లైటింగ్ లేకపోవడం వల్ల రాత్రి వేళ ప్రమాదాలు పెరుగుతున్నాయని, భద్రతా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల భద్రత, ప్రజల రక్షణతో పాటు పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి దృష్ట్యా తక్షణమే వీధి దీపాల ఏర్పాటు చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రటరీ వుండం శ్రీనివాస్‌తో పాటు ఇతర సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని పూర్తి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ,"ప్రజల సమస్యలపై కేవలం మాటలకే పరిమితం కాకుండా, అధికారుల వద్దకు తీసుకెళ్లి పరిష్కారం వచ్చే వరకు పోరాటం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. మల్లాపూర్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుంది" అని అన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం : నెమలి అనిల్ కుమార్





**మల్లాపూర్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజ్ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స ఏఈ సిరాజ్‌తో కలిసి కాలనీలో పర్యటించిన కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ,"బస్తీల్లో నివసించే ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటికి శాశ్వత పరిష్కారాలు తీసుకురావడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలు వినడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, పరిష్కారం వచ్చే వరకు నిరంతరంగా అనుసరణ చేయడమే బస్తీబాట కార్యక్రమం ప్రధాన ఉద్దేశం" అని తెలిపారు.

అన్నపూర్ణ కాలనీలో తాగునీటి సరఫరాలో లోపాలు, డ్రైనేజ్ సమస్యలపై స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేస్తూ త్వరితగతిన చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని నెమలి అనిల్ కుమార్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ తండ్రా శ్రీకాంత్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు శేఖర్ బాబు, భాను చంద్ర రెడ్డి, పాషా, ముబీన్, ప్రసాద్, హరీష్‌తో పాటు పెద్ద సంఖ్యలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ఆల్టిట్యూడ్ హైస్కూల్‌లో ఘనంగా స్పోర్ట్స్ మీట్ ప్రారంభం





**ఎల్కతుర్తి, జనవరి 22: (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఆల్టిట్యూడ్ హైస్కూల్‌లో స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల క్రీడా ప్రదర్శనలు, వ్యాయామ విన్యాసాలు, పాటలతో అలరించారు. క్రీడా మైదానంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

ఈ స్పోర్ట్స్ మీట్ మూడు రోజుల పాటు కొనసాగనుందని, ఈ సందర్భంగా అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, లాంగ్ జంప్, షార్ట్ పుట్ తదితర వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుతున్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పుష్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ, చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. క్రీడల వల్ల పిల్లలకు శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని తెలిపారు. గెలుపోటములు సహజమేనని, అయితే పోటీతత్వం పెరగడం ద్వారా విద్యార్థులు జీవితంలో ముందుకు సాగేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్, వైస్ ప్రిన్సిపాల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు సరిత, లావణ్య, శ్వేత, మమత, సురేష్, ఆశా బేగం, కిషోర్, కృష్ణ, కవిత, గీత, స్వప్న, శ్రావణి, కావ్య, రమ్య తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకులాల అడ్మిషన్ పోస్టర్ ఆవిష్కరణ





**ఖమ్మం బ్యూరో, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం మైనారిటీ గురుకుల పాఠశాల గర్ల్స్ యందు 5 వ, 6 వ, 7 వ మరియు 8 వతరగతి ప్రవేశాలకు ఆన్లైన్లో దరఖాస్తుల ప్రారంభ అయిన సందర్భంగా గురువారం నాడు పోస్టర్ ను పాఠశాల యందు అబ్దుల్ మలిక్ మీడియా సెక్రెటరీ జమాఅతె ఇస్లామీ హింద్ ఖమ్మం ,షేక్ ఖాసీం ఎంపీజే జిల్లా అధ్యక్షులు హకీమ్ ఎంపీజే ఉప అధ్యక్షులు, మౌలానా సాధిక్ ఇమామ్ మసీద్ ఇ ఇబ్రహీం, ఆర్ ల్ సి ఎం జె అరుణకుమారి , పాఠశాల ప్రిన్సిపాల్ ఎం శైలజ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లితండ్రులు సమక్షంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు , అధ్యాపకులతో నాణ్యమైన విద్య పోషకాహారంతో పాటు నిరంతర పర్యవేక్షణలో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. పాఠశాల నందు 5 వ తరగతి యందు 51 ముస్లిం, 5 క్రిస్టియన్స్, 1 జైన్, 1 పార్సి, 1 బౌద్ధ, 1 సిక్కు,6 వ తరగతి యందు 24 ముస్లిం 7 వ తరగతి యందు 4 ముస్లిం, 8 వ తరగతి యందు 8 ముస్లిం సీట్లు ఖాళీగా ఉన్నాయని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఇదే విధంగా దరఖాస్తుల వివరాల కోసం 7331170860 ను సంప్రదించగలరని అన్నారు

# రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌లో స్థానికులకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

- **బీజేపీ మండల అధ్యక్షులు మంతూర్తి శ్రీకాంత్ యాదవ్**



**ఎల్కతుర్తి, జనవరి 22 ( తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని సూరారం శివారులో ఏర్పాటు చేయనున్న రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌లో ఉద్యోగాల భర్తీలో స్థానిక యువతి, యువకులకే తొలి ప్రాధాన్యత కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షులు మంతూర్తి శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రిలయన్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ మండల కేంద్రంలో స్థాపించబడటం ఆనందకరమైన విషయమని అన్నారు. అయితే ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న స్థానిక యువతను పక్కన పెట్టడం తగదని స్పష్టం చేశారు. స్థానిక యువత విద్యార్హతలు, నైపుణ్యాలను బట్టి తగిన ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత పూర్తిగా కంపెనీ యాజమాన్యంపైనే ఉందని పేర్కొన్నారు. ఈ అంశంపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు చొరవ తీసుకొని కంపెనీ యాజమాన్యంతో చర్చించి మండలానికి చెందిన యువతి, యువకులకు అధిక సంఖ్యలో ఉద్యోగాలు దక్కేలా చర్యలు చేపట్టాలని కోరారు.స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే పరిశ్రమల స్థాపనకు ప్రజల మద్దతు మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో నిందుతుడు అరెస్ట్ రిమాండ్ కు తరలింపు



- **చింతకాని ఎస్సై వీరేందర్**

**ఖమ్మం బ్యూరో, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** చోరీ కేసులో నిందుతుడిని అరెస్ట్ రిమాండ్ కు తరలించినట్లు చింతకాని ఎస్సై వీరేందర్ తెలిపారు.వందనం గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్ రావు అతని కుటుంబ సభ్యులతో ఈనెల 15 తారీకు నాడు తిరుపతి దర్శనానికి వెళ్లి తిరిగి 20వ తారీకు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉండగా గమనించి ఎవరో దొంగలు పడ్డారని ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో బీరువాలో ఉన్న బంగారు వస్తువులు వెండి వస్తువులు కొంత నగదు మరియు టీవీ కనిపించకపోవడంతో చింతకాని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసి అట్టి దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులలో ఒక వ్యక్తిని ఈరోజు చింతకాని ఎస్ఐ తన సిబ్బందితో వందనం గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా దొంగతనం చేసిన సొమ్ముతో ఇద్దరు వ్యక్తుల్లో ఒక వ్యక్తి కాకరకాయల నరేష్ (వందనం గ్రామం) అను వ్యక్తి పారిపోతుండగా పట్టుకొని అతని వద్ద నుండి దొంగతనం చేసిన వస్తువులను రికవరీ చేసి అతని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది. మరో నిందితుడు కందుకూరి సోమాచారి (సత్తుపల్లి) పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు చెందించిన ఎస్సై ఎన్ వీరేందర్, ఏఎస్ఐ లక్ష్మణ్ చౌదరి, హెచ్ సి రాములు హెచ్ సి శ్రీనివాస్ పిసి గజేంద్ర పీ సి శ్రీనివాస్ వైరా ఇంచార్జ్ ఏసీపీ వసుంధర యాదవ్ అభినందించారు.

# విక్టరీ వెంకటేష్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



**ఖమ్మం బ్యూరో,జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** విక్టరీ వెంకటేష్ ఆల్ ఇండియా ఫ్యాన్స్ ప్రెసిడెంట్ పూర్ణ, సెక్రటరీ రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు సోమ్ సుంధర్, ఉపాధ్యక్షులు బాబాజీ, ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో ఖమ్మం జిల్లా విక్టరీ వెంకటేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సరం పురస్కరించుకొని జాతీయ నటుడు దగ్గుబాటి విక్టరీ వెంకటేష్ క్యాలెండర్ ను జిల్లా వెంకటేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆవిష్కరించారు. తమ అభిమాన జాతీయ నటుడు విక్టరీ వెంకటేష్ ఆయురారోగ్యాలతో ఉండాలని. ఇప్పటివరకు తన ఖాతాలో ఎన్నో విజయవంతగా ప్రేక్షకుల హృదయాల్లో ఉండిపోయేలా సినిమాలో హీరోగా నటించిన ఒక టాలీవుడ్ ఇండస్ట్రీకి అదృష్టంగా భావిస్తున్నామని. అదేవిధంగా రాబోయే కాలంలో అనేక సినిమాలలో నటించాలని ఫాన్స్ అసోసియేషన్ తరుపున కోరారు. ఈ ఆవిష్కరణలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు రాగూరి కోటి, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల తిరుమలరావు, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు అంకిత్ సతీష్. ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఉప్పతల శ్రీను(తులసి), ఖమ్మం జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ దొంతు సతీష్, ఖమ్మం టౌన్ ప్రేసిడెంట్ టీ.ఆర్.కె ప్రసాద్, ఆర్గనైజర్ ఎస్. కె.బాజీ, కార్యవర్గ సభ్యులు కె.భవాని, గోగుల నరేష్, రాజేష్ మరియు ఖమ్మం జిల్లా విక్టరీ వెంకటేష్ మరియు రానా బాబు, అభిమానులు పాల్గొన్నారు.

# భూగర్భ డ్రైనేజీ,అన్నపూర్ణ కాలనీలో స్మశాన వాటిక అభివృద్ధి పనులు ప్రారంభం



**నాచారం, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం ప్రాంతంలో రూ.11.55 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తో కలిసి ప్రారంభించారు. ఈ డ్రైనేజీ పనుల ద్వారా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు.అనంతరం అన్నపూర్ణ కాలనీలోని బుడగ జంగాల స్మశాన వాటికలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుభారంభం చేశారు. ఈ పనుల ద్వారా స్మశాన వాటికలో మౌలిక వసతులు మరింత మెరుగుపడి, ప్రజలకు సౌకర్యవంతంగా మారనున్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యం ప్రతి కాలనీలో అవసరమైన మౌలిక వసతులను కల్పించడం అని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రతినిధులు, బుడగ జంగాల అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మానవత్వమే "ఫాదర్ జెరోమ్" మార్గం

**రాంపూర్,జనవరి22(తెలంగాణ ముచ్చట్లు):** మతం ఒక ఆచారంగా పరిమితమయ్యే చోట, మానవత్వాన్ని జీవన విధానంగా మార్చుకున్న వ్యక్తి ఫాదర్ జెరోమ్. మూడు దశాబ్దాలుగా ఆయన సాగిస్తున్న సేవా ప్రయాణం మతపరమైన పరిధులను దాటి, సమాజంలోని అట్టడుగు మనుషుల జీవితాల్లో ఆశగా నిలుస్తోంది.
దిక్కులేని అనాధలు, వితంతువులు, వృద్ధులు, మానసిక వికలాంగులు, నిరాశ్రయులు... వీరంతా ఫాదర్ జెరోమ్ సేవా ప్రయాణానికి కేంద్ర బిందువులు. ఎవరు ఏ కులానికి, ఏ మతానికి చెందినవారన్న ప్రశ్న ఆయన వద్ద ఉండదు. అవసరం ఉన్న మనిషే ఆయనకు గుర్తింపు. ఒక్కరోజు సాయం చేసి వెళ్లిపోవడం కాదు, వారి జీవితాల్లో భరోసా కలిగే వరకు తోడుగా ఉండాలన్నదే ఆయన సేవలో కనిపించే మానవత్వం. ఈ మానవత్వానికి నిదర్శనంగా ధర్మసాగర్ మండలం స్టేషన్ రాంపూర్‌లోని జీవదార దివ్య కేంద్రంలో గురువారం మానసిక వికలాంగులకు





చేయూత కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 53 గ్రామాల నుంచి 200కు పైగా మానసిక వికలాంగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకొని, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రెండు వేల రూపాయల ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర వస్తువులు అందించే కార్యక్రమాన్ని ఫాదర్ జెరోమ్ కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మానవసేవే మాధవసేవ అని, దేవునికి కులం, మతం, జాతి వంటి భేదాలు ఉండవని ఫాదర్ జెరోమ్ తెలిపారు. సాటి మనిషిని ప్రేమించడమే నిజమైన ఆరాధనగా భావించాలని అన్నారు. ముఖ్యంగా అనాధలు, వితంతువులు, మానసిక వికలాంగుల సేవలోనే దేవుడిని చూడగలమని పేర్కొన్నారు. అదే ప్రేరణతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 200 కుటుంబాలను స్వయంగా సందర్శించి, వారి కష్టాలను తెలుసుకొని, వారిని తన కుటుంబ సభ్యులుగా భావించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు.
ఫాదర్ జెరోమ్ సేవలు మాటలకే పరిమితం కావు. కష్టంలో ఉన్న వారి ఇంటి ముంగిట ఆయన అడుగులే సాక్ష్యం. ఆకలితో ఉన్నవారికి అన్నం, దుస్తులు లేనివారికి వస్త్రం, ఆశ కోల్పోయినవారికి ఓ ధైర్య వాక్యం... ఇవన్నీ ఆయన సేవలో భాగాలే. ఇది దానం కాదు, బాధ్యత అన్న భావన ఆయన చర్యల్లో స్పష్టంగా కనిపిస్తుంది. సేవ కూడా ప్రచారంగా మారుతున్న ఈ కాలంలో, ఎలాంటి హంగు లేకుండా, ఎలాంటి స్వార్థం లేకుండా సాగుతున్న ఫాదర్ జెరోమ్ సేవలు అరుదైనవి. ఆయన చేస్తున్న పని పెద్ద శబ్దంతో కనిపించకపోయినా, అనేక జీవితాల్లో నిశ్శబ్దంగా వెలుగు నింపుతోంది.ఫాదర్ జెరోమ్ ఒక వ్యక్తి మాత్రమే కాదు. మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణ. సమాజానికి అద్దం పట్టే జీవితం.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో యువకుడి బలి

**వేలేరు,జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆన్‌లైన్(బెట్టింగ్) ఆటలకు దూరంగా ఉండాలంటూ ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా సమాజంలో మార్పు కనిపించడం లేదు. ఆన్‌లైన్ బెట్టింగ్, ఆటలకు బానిసలై అప్పులపాలవుతూ యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా హనుమకొండ జిల్లా వేలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది.
వేలేరు పోలీసుల వివరాల ప్రకారం, ములకనూరు గ్రామానికి చెందిన రామ్ చరణ్ (23) ఆన్‌లైన్(బెట్టింగ్) ఆటలకు అలవాటు పడి పెద్ద మొత్తంలో డబ్బులు కోల్పోయాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన అతడు పురుగుల మందు సేవించాడు. అనంతరం ఈ విషయాన్ని తన బావ అయిన వేలేరు గ్రా



మానికి చెందిన జెట్టి విష్ణుకు ఫోన్ ద్వారా తెలియజేశాడు.సమాచారం అందుకున్న జెట్టి విష్ణు వెంటనే రామ్ చరణ్‌ను వేలేరు మండల కేంద్రంలోని ఎల్లమ్మ వాగు సమీపం నుంచి వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వేలేరు ఎస్సై సురేష్ వెల్లడించారు.

# కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజల వద్దకే సీఎంఆర్ఎఫ్ చెక్కులు



◆ మద్ది గట్ల సర్పంచ్ మేకల రాములు

**పెద్దమందడి,జనవరి22(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజల ఇంటి వద్దకే సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేయడం జరుగుతుందని పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామ సర్పంచ్ మేకల రాములు తెలిపారు. వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి ఆదేశం మేరకు మదిగట్ల గ్రామంలో సర్పంచ్ మేకల రాముడు వార్డు సభ్యులతో కలిసి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇంటికి నాయకులు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకొని చెక్కులను అందజేయడం జరిగింది. సుగన్న, హనుమంత రెడ్డి, లలిత, శివశంకర్ లకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల రాములు యాదవ్, ఉపసర్పంచ్ రవి సాగర్, మాజీ ఎంపిటిసి రామచంద్రయ్య గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొగులయ్య, వాడు సభ్యులు రాములు, బాలకృష్ణ గౌడ్, జానకి బాలకృష్ణ, వెంకటేష్ గౌడ్, నాగేష్ యాదవ్, భరత్రాజ్, వెంకటేష్ సాగర్, మీసాల రాములు, రవి, పరమేష్ రాములు, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేటిఆర్ కు సిట్ నోటీసులు

జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**జనగామ,జనవరి22(తెలంగాణ ముచ్చట్లు):** కేటీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడం బొగ్గు కుంభకోణం వంటి ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకేనని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.
గతంలో కూడా కేటీఆర్ పై అనేక కేసులు, కమిషన్లు వేసినప్పటికీ ఇప్పటివరకు ఏ ఒక్క కేసులోనూ నిజం తేలలేదని పేర్కొన్నారు. అలాగే గతంలో హరీష్ రావుపై సిట్ నోటీసులు జారీ చేసిన సందర్భంలో సుప్రీం కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ కక్షసాధింపు చర్యలు కొనసాగడం దురదృష్టకరమని విమర్శించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసి, ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడమే ప్రధాన పనిగా మారిందని పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ఒత్తిళ్లకు లోబడి కొంతమంది అధికారులు బీఆర్ఎస్ నాయకులను ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఇలాంటి చవకబారు రాజకీయాలకు పాల్పడిన అధికారులు, కాంగ్రెస్ నాయకులు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.
మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, అభ్యర్థులు పాల్గొనకుండా అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే సిట్ నోటీసుల పేరుతో కాలయాపన చేస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. పోలీసుల బెదిరింపులు, అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడదని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై తమకు సంపూర్ణ గౌరవం ఉందని, న్యాయపరంగా అలాగే ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని గట్టిగా ఎదుర్కొంటామని ప్రకటించారు.
తక్షణమే ఈ కక్షసాధింపు చర్యలను నిలిపివేయకపోతే, భవిష్యత్తులో తీవ్ర రాజకీయ పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని పల్లా రాజేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.



# ఖమ్మం జిల్లా టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షునిగా హెచ్. వెంకటేశ్వర్‌రావు

**సత్తుపల్లి, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు లంక వెంకటేశ్వర్లు, ఎల్.వి.ఆర్ మాదిగల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఖమ్మం జిల్లా టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షునిగా సత్తుపల్లి నియోజకవర్గం కాకర్లపల్లి గ్రామానికి చెందిన హెచ్. వెంకటేశ్వరరావును నియమించారు. టీఎస్ ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో గత 28 సంవత్సరాలుగా చురుకైన పాత్ర పోషిస్తూ, ఎస్సీ వర్గీకరణ కోసం నిరంతరంగా పోరాటం చేస్తున్న నాయకుడిగా హెచ్. వెంకటేశ్వరరావుకు గుర్తింపు ఉంది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇచ్చిన ప్రతి కార్యచరణను ముందుండి నడిపిన వ్యక్తిగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల హక్కుల కోసం పోరాడిన నేతగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న, జాతీయ ఉపాధ్యక్షులు లంక వెంకటేశ్వర్లు, ఎల్.వి.ఆర్ మాదిగలు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అలాగే పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి మేళ్లచెరువు నాగేశ్వరరావు, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి హెచ్. హరీష్ మాదిగ, వేంసూరు మండల అధ్యక్షుడు మేకల వెంకటేశ్వర్లు, కల్లూరు మండల అధ్యక్షుడు వేల్పుల జానీ, ఖమ్మం జిల్లా నాయకులు పొట్టపింజర వెంకటరత్నం, ముదిగొండ మండల అధ్యక్షుడు కొత్తపల్లి నరసింహ, విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షుడు కర్ష ఉపేందర్, మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు మేళ్లచెరువు నాగమణి, చింతకాని మండల అధ్యక్షుడు సింగారపు బాబురావు తదితరులు హాజరై, ఖమ్మం జిల్లా కమిటీ తరపున హెచ్. వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.





# లచ్చన్నగూడెం ఐకెపి కొనుగోలు కేంద్రంలో రైతులకు చుక్కెదురు.!

- ◆ మిల్లర్ల దగాతో లక్షల రూపాయల నష్టం.
- ◆ తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా.

**సత్తుపల్లి, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం లచ్చన్నగూడెం గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గత సారవ వరి సీజన్‌లో ధాన్యం విక్రయించిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. నేలకొండపల్లి చెందిన సహస్ర రైస్ మిల్లు, అరుణాచల శివ రైస్ మిల్లుల యాజమాన్యాలు ప్రతి క్వింటా ధాన్యానికి 14 కిలోల చొప్పున అక్రమంగా కటింగ్ చేసి, ట్రక్ షీట్లలో తక్కువ బరువు చూపించి వాటికే గాను రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేసినట్లు బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఈ దగాతో మొత్తం 24 మంది రైతులు బోనస్‌తో కలిపి సుమారు రూ.30 లక్షల వరకు నష్టపోయినట్లు నిర్ధారించుకున్నారు. తమకు జరిగిన అన్యాయంపై గురువారం రైతులు ప్రదర్శన నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మిల్లర్ల అక్రమాలకు బాధ్యత వహిస్తూ సంబంధిత మిల్లుల లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నాయబ్ తహశీల్దార్ బంతిరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ఐకెపి సిబ్బంది ట్రక్ షీట్లలో బస్తాల సంఖ్య, క్వింటాళ్ల వివరాలను నమోదు చేసినప్పటికీ, మిల్లర్లు వాటిని ఎలా తక్కువగా రాసి సంతకాలు, ముద్రలు వేస్తున్నారని ప్రశ్నించారు. గ్రేడ్‌ఏగా ధాన్యం నిర్ధారించిన తర్వాత కూడా కోతలు విధించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిని స్వీకరించిన నాయబ్ తహశీల్దార్ బంతిరాం స్పందిస్తూ, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్‌తో పాటు బాధిత రైతులు ఇమ్మడి మల్లేశ్వరరావు, నాయుడు శ్రీనివాసరావు, బోయినపల్లి సత్యనారాయణ, రాయల నరసింహారావు, ఇమ్మడి శంకర్‌రావు, అన్నపురెడ్డి కృష్ణయ్య, పతేపరుపు అంజారావు, హనుమంతరావు, మాణికల రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.



# గిడుగు రామ్మూర్తి పంతులు 86వ వర్ధంతి చిత్రపటానికి పూలమాల

**ఏ ఎస్ రావు నగర్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు) :** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం-స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ కార్యాలయంలో వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు 86వ వర్ధంతి సందర్భంగా నివాళి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గౌడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు.ముందుగా ప్రముఖ జర్నలిస్టు గుమ్మడి హరి ప్రసాద్, స్ఫూర్తి గ్రూప్ సీనియర్ నాయకులు జంపాల శ్రీమన్నారాయణ గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గౌడుగు యాదగిరిరావు మాట్లాడుతూ, గిడుగు రామ్మూర్తికి ముందే వేమన వంటి వారు వ్యవహారిక భాషలో గొప్ప సాహిత్యం సృష్టించినప్పటికీ, ఆనాటి గ్రాంధిక భాష ఆధిపత్యం కారణంగా వాటికి తగిన గుర్తింపు లభించలేదన్నారు. ప్రజల నిత్యజీవితంలో మాట్లాడే భాషనే సాహిత్య భాషగా స్థాపించేందుకు గిడుగు రామ్మూర్తి పంతులు ఉద్యమాత్మకంగా పోరాడారని తెలిపారు. ఆ ఉద్యమ ఫలితంగానే నేడు తెలుగు భాష మరింత గౌరవప్రదంగా ముందుకు సాగుతోందన్నారు.సీనియర్ నాయకులు జంపాల శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, గిడుగు రామ్మూర్తి పంతులు బహుభాషా కోవిదుడిగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ, అధికారిక భాషా విద్య లేకున్నా తెలుగు భాషపై విస్తృత పరిశోధనలు చేశారని అన్నారు. గిరిజన భాష అయిన సవర భాషను అభివృద్ధి చేసి, దానికి లిపి, నిఘంటువు రూపొందించిన గొప్ప భాషా శాస్త్రవేత్తగా ఆయన నిలిచారని కొనియాడారు. ఆయన సేవలకు గుర్తింపుగా బ్రిటిష్ ప్రభుత్వం "కైసర్-ఇ-హింద్" పతకాన్ని ప్రదానం చేసిందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో గుమ్మడి హరి ప్రసాద్, జయరాజు, జి. శివరామకృష్ణ తదితరులు ప్రసంగించారు. అనంతరం సభ్యులందరూ గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, గౌసియా, నాగేశ్వరరావు, శివరామకృష్ణ, ఎం. భాస్కర్ రావు, పి. మల్లేశం, శ్రీమన్నారాయణ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వారెవ్వా.. ఫోన్‌పేలో 5 లక్షల వరకు లోన్.. సింపుల్‌గా చేస్తే నిమిషాల్లోనే డబ్బు ఖాతాలో జమ..!

జేబులో చిల్లిగవ్వ లేకుండా అత్యవసరంగా డబ్బు కావాల్సిన పరిస్థితుల్లో బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇప్పుడు మొబైల్ ద్వారానే లోన్ పొందే అవకాశం వచ్చింది. రోజూ వినియోగించే ఫోన్‌పే యాప్ ద్వారా ఎలాంటి తాకట్టు లేకుండా 10000 నుంచి గరిష్టంగా 5 లక్షల వరకు వ్యక్తిగత రుణం పొందవచ్చు. ఇది పూర్తిగా డిజిటల్ విధానంలో జరుగుతుంది కాబట్టి ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత ఉన్నవారికి దరఖాస్తు ఆమోదం అయిన 72 గంటల్లోనే డబ్బు నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. లోన్ తిరిగి చెల్లించేందుకు 12 నుంచి 60 నెలల వరకు గడువు ఎంపిక చేసుకునే సౌలభ్యం ఉంటుంది. వడ్డీ రేటు 11.30 శాతం నుంచి 35 శాతం వరకు ఉండే అవకాశం ఉంది. 21 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగి నెలకు కనీసం 15000 ఆదాయం ఉన్నవారు ఈ లోన్‌కు అర్హులు. సిబిల్ స్కోర్ 650 కంటే ఎక్కువగా ఉంటే లోన్ వచ్చే అవకాశాలు మరింత పెరుగుతాయి. దరఖాస్తు చేయడానికి ఆధార్ కార్డు, పాన్ కార్డు, గత 6 నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్, జీతభత్యాల స్లిప్పులు సిద్ధంగా ఉంచుకోవాలి. ఫోన్‌పే యాప్ ఓపెన్ చేసి లోన్లు అనే విభాగంలోకి వెళ్లి వ్యక్తిగత వివరాలు నమోదు చేసి అర్హతను పరిశీలించాలి. అనంతరం కావలసిన లోన్ మొత్తం, కాలపరిమితిని ఎంచుకుని అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ప్రాసెసింగ్ ఫీజు, నెలవారీ వాయిదాల వివరాలు ముందుగానే స్పష్టంగా కనిపిస్తాయి కాబట్టి దాచిన చార్జీలు ఉండవు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# హిమాలయాల సెంటినెల్స్‌తో భేటీ

- ఉత్తర భారత్ పరిధిలో ఆపరేషనల్ సిద్ధతల సమీక్ష
- ట్రైపిక్స్ బ్రిగేడ్ సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి
- ఆధునిక సాంకేతికత–యుద్ధ నైపుణ్యాల సమన్వయం

**హిమాచల్ ప్రదేశ్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**

హిమాచల్ ప్రదేశ్‌లోని కఠినమైన పర్వత ప్రాంతాల్లో భారత సైన్యం ఆపరేషనల్ సిద్ధతలను సమీక్షించారు. ఉత్తర భారత్ బాధ్యతలు నిర్వహిస్తున్న డి.జి. మిశ్రా ట్రైపిక్స్ బ్రిగేడ్ సైనికులతో కలిసి పరిశీలన చేపట్టారు. హిమాలయాల ఎత్తైన ప్రాంతాల్లో ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఎదుర్కొనేలా సైన్యం సిద్ధంగా ఉందని ఈ సమీక్ష స్పష్టం చేసింది.

సైనికులతో నేరుగా మాట్లాడిన లెఫ్టినెంట్ జనరల్, వారి దృఢ సంకల్పం, నిరంతర శిక్షణ, వినూత్న ఆలోచనలను ప్రశంసించారు. కఠిన వాతావరణంలోనూ విధి నిర్వహణలో వెనుకడుగు వేయని తీరును అభినందించారు. ఈ శిక్షణ విధానాలు సరిహద్దుల రక్షణలో కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ, యుద్ధ నైపుణ్యాలను మరింత పదును పెట్టుకున్న ట్రైపిక్స్ బ్రిగేడ్ సైనికులు ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనే సామర్థ్యం కలిగి ఉన్నారని అధికారులు తెలిపారు. ఎత్తైన ప్రాంతాల్లో ఆపరేషన్లకు అవసరమైన లాజిస్టిక్స్, కమ్యూనికేషన్, మానవ వనరుల సిద్ధతపై సమగ్ర సమీక్ష జరిగింది.

దేశ రక్షణే లక్ష్యంగా, ఎప్పుడు-ఎక్కడైనా స్పందించే స్థాయిలో భారత సైన్యం సిద్ధంగా ఉందని ఈ సందర్శన మరోసారి నిరూపించింది. హిమాలయాల సెంటినెల్స్‌గా పేరుగాంచిన సైనికులు, సరిహద్దుల భద్రతకు అంకితభావంతో ముందుండి నడుస్తున్నారని సైనిక వర్గాలు వెల్లడించాయి.



# ప్రారంభం కాకముందే కూలిన వాటర్ ట్యాంక్

- 33 గ్రామాలకు తాగునీరు లక్ష్యంగా రూ.21 కోట్ల నిర్మాణం
- ట్రయల్ రన్‌లోనే పేకమేడలా కుప్పకూలిన కట్టడం
- నాసిరకం సామగ్రి వాడకంపై అనుమానాలు

**సూరత్, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**

గుజరాత్ రాష్ట్రం గుజరాత్‌లోని సూరత్ జిల్లా పరిధిలో 33 గ్రామాలకు రక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన భారీ వాటర్ ట్యాంక్ ప్రారంభం కాకముందే కూలిపోయింది. రూ.21 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పాలకుల అవినీతి, నిర్మాణ లోపాల కారణంగా నేలమట్టమైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గాయ్‌పగ్లా గ్రూపు వాటర్ సప్లై స్కీమ్ కింద మాండ్వి తాలూకాలోని తాడ్‌కేశ్వర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 11 లక్షల లీటర్ల నిల్వ సామర్థ్యంతో, 15 మీటర్ల ఎత్తుతో నిర్మించిన ట్యాంక్‌కు సోమవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద శబ్దంతో కట్టడం ఒక్కసారిగా కూలిపోయి స్థానికుల్లో తీవ్ర భయాందోళనను కలిగించింది.

మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు దాదాపు 9 లక్షల లీటర్ల నీటితో ట్యాంకును నింపినట్లు అధికారులు తెలిపారు. అయితే హఠాత్తుగా మొత్తం నిర్మాణం పేకమేడలా కూలిపోవడంతో నాసిరకం సామగ్రి వాడినట్టు ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ నాణ్యతపై పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ ప్రమాదంలో ఓ మహిళతో సహా ముగ్గురు కార్మికులు గాయపడగా, వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. వాటర్ ట్యాంక్‌కు ఇంకా ప్రారంభోత్సవం జరగకపోవడం, నివాస గృహాలకు తాగునీటి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# యూరోపియన్ యూనియన్ రాయబారులతో కీలక భేటీ

- ప్రపంచ అస్థిరతపై చర్చ – భారత్–ఈయూ భాగస్వామ్యంపై దృష్టి
- సరఫరా గొలుసులు, వాణిజ్యం, భద్రతపై సహకారం అవసరం
- గణతంత్ర దినోత్సవానికి ఈయూ నేతల భారత పర్యటనపై ఆశాభావం

**న్యూఢిల్లీ, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**



యూరోపియన్ యూనియన్ దేశాల రాయబారులతో నిర్వహించిన సమావేశంలో ప్రపంచంలో పెరుగుతున్న అస్థిరత, అనిశ్చితి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో అస్థిరతే కొత్త సాధారణంగా మారిందని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా భారత్-యూరోపియన్ యూనియన్ సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని మంత్రి స్పష్టం చేశారు. బలమైన సరఫరా గొలుసులపై పరస్పర సహకారం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం కల్పించవచ్చని, విపత్తు సహాయక చర్యలు, సముద్ర దోపిడీ నిరోధక కార్యకలాపాలు, అభివృద్ధి ప్రాజెక్టుల వంటి ప్రజాప్రయోజన సేవల ద్వారా అంతర్జాతీయ సమాజానికి భరోసా ఇవ్వవచ్చని తెలిపారు.

వాణిజ్యం, వలసల సౌలభ్యం, భద్రతా భాగస్వామ్యం వంటి రంగాల్లో సమన్వయం పెంచడం ద్వారా ప్రపంచ క్రమానికి స్థిరత్వం తీసుకురావచ్చని జైశంకర్ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా భారత్ మరియు యూరోపియన్ యూనియన్ కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

రాబోయే గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ భారత్‌కు రానున్న నేపథ్యంలో, ఆ పర్యటన భారత్-ఈయూ సంబంధాలకు మరింత బలం చేకూరుస్తుందని విదేశాంగ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఐఎఫ్ఎంఎక్స్-2026లో భారత యాంత్రిక దళాల సమన్విత శక్తి ప్రదర్శన

- ఘాతుక సిద్ధత – సమగ్ర ఆధిపత్యం
- ట్యాంకులు, బీఎంపీ–2, డ్రోన్లు, వైమానిక వనరుల సమన్వయం
- బహుళ రంగ ఆపరేషన్లకు పూర్తి సన్నద్ధత

**న్యూఢిల్లీ, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**

సమగ్ర ఫైర్ పవర్ & మానోవర్ వ్యాయామం ఐఎఫ్ఎంఎక్స్-2026 భారత యాంత్రిక దళాల యుద్ధ సామర్థ్యం, ఆపరేషనల్ సమన్వయాన్ని ఘనంగా ప్రదర్శించింది. ఈ వ్యాయామం భారత సైన్యం ఆధ్వర్యంలో, ఆర్మర్డ్ కార్ప్స్ సెంటర్ & స్కూల్, మెకనైజ్డ్ ఇన్ఫెంట్రీ సెంటర్ & స్కూల్ సంయుక్తంగా నిర్వహించారు.

నెట్‌వర్క్‌డ్ యుద్ధభూమిలో మానవ-యంత్ర సమన్వయం ఎలా పనిచేస్తుందో ఈ వ్యాయామం స్పష్టంగా చూపింది. ట్యాంకుల వేగవంతమైన దాడి సామర్థ్యం, బీఎంపీ-2 వేదికల బహుముఖ వినియోగం, ఆధునిక డ్రోన్లు మరియు వైమానిక వనరుల సమగ్ర వినియోగం ద్వారా బహుళ రంగ ఆపరేషన్లకు సైన్యం సిద్ధంగా ఉందని నిరూపించింది.

వ్యాయామానికి డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్, డిఫెన్స్ సర్వీసెస్ టెక్నికల్ స్టాఫ్ కాలేజ్ అధికారులతో పాటు నేపాల్ సైన్యం కమాండ్ అండ్ స్టాఫ్ కోర్సు అధికారుల పాల్గొనడం విశేషంగా నిలిచింది. ఇది వృత్తిపరమైన సైనిక మార్పిడికి, భవిష్యత్ నాయకత్వాన్ని బలోపేతం చేసే పంచుకునే అభ్యాసానికి దోహదపడిందని అధికారులు తెలిపారు.

ఐఎఫ్ఎంఎక్స్-2026 ద్వారా సమగ్ర, బహుళ రంగ యుద్ధాలకు భారత యాంత్రిక దళాలు ఎప్పుడూ సిద్ధమేనని మరోసారి రుజువైందని సైనిక వర్గాలు వెల్లడించాయి.






# మేడారం సమ్మక్క–సారలమ్మ తల్లులను దర్శించుకున్న తీన్మార్ మల్లన్న

- తెలంగాణ కుంభమేళాగా పేరొందిన మేడారం జాతరలో ప్రత్యేక పూజలు
- గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా మేడారం
- గిరిజన గూడాల సందర్శన, జీవన పరిస్థితులపై ఆరా

**మేడారం, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం జాతరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి అడవి తల్లి ఒడిలో, జంపన్న వాగు ఒడ్డున వెలసిన శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.



అడవిబిడ్డల ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపాలైన సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకోవడం గర్వకారణమని ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న తెలిపారు. సంప్రదాయ రీతిలో ఎత్తు బంగారం సమర్పించి తల్లుల ఆశీర్వాదం పొందారు. మేడారం జాతర గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మాభిమానానికి ప్రతీకగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

జాతర అనంతరం ములుగు జిల్లా పరిధిలోని కొన్ని గిరిజన గూడాలను తీన్మార్ మల్లన్న సందర్శించారు. అక్కడి ప్రజలతో మమేకమై వారి జీవన విధానం, సమస్యలు, అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. గిరిజనుల జీవన ప్రమాణాల మెరుగుదలకు తమ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు సుదగాని హరిశంకర్ గౌడ్, మాదం రజనీ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లబోయిన ఓదేలు యాదవ్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్, రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజా గౌడ్తో పాటు హన్మకొండ, వరంగల్, మెదక్, సూర్యాపేట జిల్లాల అధ్యక్షులు, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రయాణికులకు అమృత్ భారత్ రైలు శుభవార్త

- చర్లపల్లి–తిరువనంతపురం మధ్య కొత్త సర్వీస్
- ఏపీలో కీలక స్టేషన్లకు హాల్ట్‌లు
- తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ప్రయాణం

ఆంధ్రప్రదేశ్ ప్రయాణికులకు భారతీయ రైల్వే శాఖ శుభవార్త అందించింది. తెలంగాణలోని చర్లపల్లి నుంచి కేరళ రాజధాని తిరువనంతపురం వరకు కొత్తగా అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ కొత్త రైలు సేవను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం తిరువనంతపురంలో జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ రైలు ప్రారంభంతో దక్షిణ భారతదేశంలో రైల్వే కనెక్టివిటీ మరింత బలోపేతం కానుంది.

ఈ సూపర్ ఫాస్ట్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఆంధ్రప్రదేశ్‌లో సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట జంక్షన్‌లలో ఆగనుంది. దీంతో ఏపీ నుంచి కేరళ, తెలంగాణ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుంది. అలాగే తెలంగాణలో నల్గొండ, మిర్యాలగూడ స్టేషన్లలో కూడా ఈ రైలుకు హాల్ట్‌లు ఏర్పాటు చేశారు.

రైలు షెడ్యూల్ ప్రకారం, తిరువనంతపురం నుంచి ఉదయం 10:45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4:30 గంటలకు చర్లపల్లి జంక్షన్‌కు చేరుకుంటుంది. తెలంగాణకు మరో అమృత్ భారత్ రైలు కేటాయించినందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైలు సేవ రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

సామాన్య, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని తక్కువ ధరలో సౌకర్యవంతమైన ప్రయాణం అందించాలనే లక్ష్యంతో భారతీయ రైల్వే శాఖ అమృత్ భారత్ రైళ్లను రూపొందించింది. ఇప్పటికే చర్లపల్లి నుంచి బీహార్‌లోని ముజఫర్‌పూర్ మధ్య ఒక అమృత్ భారత్ రైలు విజయవంతంగా సేవలు అందిస్తున్న సంగతి తెలిసిందే. కొత్త సర్వీస్ ప్రారంభంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రయాణికులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in